ప్రజాశక్తి
బుధవారం 29 నవంబర్ 2023 5 అనంతపురం

సమావేశంలో పాల్గొన్న అధికారులు

పారదర్శకంగా ప్రత్యేక ఓటరు జాబితా

జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ డి.మురళీధర్ రెడ్డి

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం - 2024లో భాగంగా ప్రత్యేక ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలని జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ డి.మురళీధర్ రెడ్డి ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం - 2024 లో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ ఎం.గౌతమితో కలిసి జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ డి.మురళీధర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డి.మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికల ఏడాది కావడంతో అధికారులు మరింత శ్రద్ధ వహించాలన్నారు. చిన్న తప్పుకు ఆస్కారం ఇవ్వకుండా చూసుకోవాలన్నారు. ఓటరు జాబితా రూపకల్పనలో ఎన్నికల కమిషన్ ప్రక్రియ, నిబంధనలు అమలు చేయాలన్నారు. దేశంలో పెద్ద ఎత్తున జరిగే ఎన్నికల నిర్వహణలో చిన్న తప్పు జరగకుండా ఉండాలంటే ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన వారిని నూతన ఓటర్లుగా నమోదు చేసేందుకు సాధారణ పద్ధతిని అనుసరిస్తున్నారని, అయితే వివరంగా పరిశీలన చేసి చూస్తే సరైన విచారణ చేయలేదన్న భావన వస్తుందని అభిప్రాయపడ్డారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తే తప్పులు జరిగేందుకు అవకాశం ఉండదన్నారు. బిఎల్వోలు క్షేత్రస్థాయిలో 30 - 40 శాతం మాత్రమే ఇంటింటి సర్వే చేపట్టారన్న ఫిర్యాదులు ఉన్నాయని, మిగిలిపోయిన ప్రతి ఓటర్ల జాబితాని పరిశీలన చేయాలని, ఇందులో తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. బిఎల్వోలకు శిక్షణ ఇచ్చి అప్రమత్తంగా ఉండాలని తెలియజేయాలన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు వారి ఫిర్యాదులను ముందుగానే అందించాలని, క్షేత్రస్థాయిలో నాయకులకు తెలియజేసి అందరూ సహకరించేలా చూడాలని సూచించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు డిసెంబర్ 20వ తేదీన రాష్ట్రానికి రానున్నారని డిసెంబర్ 20 లోపు మెజారిటీ క్లెయిమ్స్, డిస్పోజల్స్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఫామ్-7 దరఖాస్తులను కమిషన్ నిబంధనలు పాటించి తొలగించాలన్నారు. వంద శాతం ప్రతి ఒక్క క్లెయిమ్, అభ్యంతరాలు ఖచ్చితంగా పరిశీలన చేయాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు అందించిన ఫిర్యాదులపై కూడా పరిశీలన తప్పనిసరిగా చేయడం జరుగుతుందని, బిఎల్వోలు తిరిగి క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన చేస్తారని అన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా రూపొందించడం జరుగుతుందని పేర్కొన్నారు. కలెక్టర్ ఎం.గౌతమి మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం - 2024లో భాగంగా చేర్పులు, తొలగింపులకు సంబంధించి పది రోజుల్లోపు దరఖాస్తులను పరిశీలన చేసి పరిష్కరిస్తామన్నారు. దరఖాస్తులను మరోసారి పరిశీలన చేస్తామని ఇందుకోసం వచ్చేవారం ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామనితెలిపారు. ఆరోగ్యకరమైన ఓటరు జాబితా రూపొందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామన్నారు. రాజకీయ పార్టీల నాయకులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి అన్ని వివరాలు తెలియజేస్తున్నామన్నారు. ఫామ్-6,7,8 క్లెయిమ్స్, అభ్యంతరాలకు సంబంధించి, ఫోటో సిమిలర్ ఎంట్రీస్, డిఎస్ఇలు, జంక్ క్యారెక్టర్స్, అనోమలిస్, పదిమంది ఓటర్లు ఉన్న జాబితాకు నోషనల్ నంబర్లు ఇవ్వడం, జెండర్ రేషియా, ఎపిక్ జనరేషన్, తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ బిఎల్వోలు ఇంటింటికి క్యాంపెయిన్ చేయడం లేదని, పట్టణం నుంచి గ్రామీణ ప్రాంతాలకు ఓట్లు మారుస్తున్నారని ఫిర్యాదు చేశారు. డివిజన్లకు సంబంధించి మార్పులు, చేర్పులు ఖచ్చితంగా చేయాలని, ఓటర్ కార్డుకు ఆధార్ కార్డు లింక్ చేయించాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ గాయత్రీ దేవి, ఇఆర్ఒలు గ్రంధి వెంకటేష్, రాణి సుష్మిత, సి.శ్రీనివాసులురెడ్డి, రవీంద్ర, సుధారాణి, కరుణకుమారి, వెంకటేశ్వర్లు, వైసిపి కేవీ.రమణ, టిడిపి దేవుళ్ల మురళి, పోతుల లక్ష్మీనరసింహులు, కాంగ్రెస్ చర్మాస్‌వలి, రహమాన్ అబ్బాస్, ఆమ్ ఆద్మీ మసూద్ వలి, బహుజన సమాజ్ వాదీ హేమ సుందర్ రాజు, హరిప్రసాద్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ భాస్కర్, డిప్యూటీ తహశీల్దార్ కనకరాజు, సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్, తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి కేరాఫ్ కణేకల్ విద్యుత్ శాఖ

ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వకనే వచ్చిన కరెంట్ బిల్లు

డివిజన్ స్థాయి అధికారి కనుసన్నల్లో అక్రమాల జోరు

రైతుల గోడు పట్టించుకోని పాలకులు, అధికారులు

కణేకల్ విద్యుత్‌శాఖ కార్యాలయం

కొంతమంది స్వార్థపూరిత అధికారులు, కాంట్రాక్టర్లు కణేకల్ విద్యుత్ కార్యాలయాన్ని అవినీతికి కేరాఫ్‌గా మార్చేశారు. అన్నం పెట్టే అన్నదాతలపై సానుకూలంగా స్పందించాల్సిన అధికారులు రైతులను నిలువన దోచుకుంటూ వివక్ష చూపుతున్నారు. ఈ వ్యవసాయం ఎందుకురా బాబు అని విసిగిపోయే విధంగా రైతుల పట్ల ఇక్కడ ఉన్న విద్యుత్ శాఖాధికారులు వివక్ష చూపుతున్నట్లు మండలంలోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ప్రజాశక్తి -కణేకల్లు

కణేకల్ విద్యుత్ శాఖలో అక్రమాలు తారాస్థాయికి చేరాయి. జిల్లా అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కాంట్రాక్టర్, అధికారులు మిలాఖత్ అయి రైతులకు మంజూరైన వ్యవసాయ కనెక్షన్ల సామాగ్రిని పక్కదారి పట్టిస్తున్నారు. అధికంగా పైసలు ఇచ్చిన వారికి బహిరంగానే అమ్మేసి బాధిత రైతులకు చుక్కలు చూపిస్తున్నారు. డబ్బులు కట్టి ఆరు నెలలు కావస్తున్న ఎందుకు తమకు ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వడం లేదని రైతులు గట్టిగా అడిగితే వారికి స్తంభాలు, వైర్లు ఇచ్చి చేతులు దులిపేసుకుంటున్నారు. పలువురు రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వకపోయినా వారికి కరెంటు బిల్లులు రావడంతో రైతులు షాక్‌కు గురవుతున్నారు. లంచగొండి అధికారులు అడిగిన అమ్యామ్యాలు ఇవ్వలేక బాధిత రైతులు దిక్కుతోచనిస్థితిని ఎదుర్కొంటున్నారు. మండలంలోని వివిధ గ్రామాల రైతులకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. మెట్ట ప్రాంత రైతులు బోర్లు వేసి పంటలు సాగుపై దృష్టి సారిస్తున్నారు. ఈ క్రమంలో రైతులు విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తులు చేసుకోగా వ్యవసాయ కనెక్షన్లు మంజూరైన రైతులకు అధికారులు కాంట్రాక్టర్లు చుక్కలు చూపిస్తున్నారు. తమకు మంజూరైన సామాగ్రిలను ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు రైతులు వాపోతున్నారు. వ్యవసాయ రంగానికి కొత్త విద్యుత్ కనెక్షన్ కోసం అధికారులు ఎస్టిమేట్ వేసి ఎన్ని స్తంభాలు ఎన్ని మీటర్ల వైరు అవసరమో గుర్తిస్తారు. ఈ మేరకు రైతులు ఎస్టిమేట్ ధరను డిడి తీసి దరఖాస్తు చేసుకుంటారు. అధికారులు సీనియార్టీ బట్టి రైతులకు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తారు. కరెంట్ కనెక్షన్‌కు అవసరైన సామాగ్రి జిల్లా కేంద్రంలోని స్టాక్ పాయింట్ నుంచి కణేకల్ సబ్ స్టేషన్ లోని స్టోర్ రూమ్ కు తరలిస్తార.ు అయితే ఇలా మంజూరైన అగ్రికల్చర్ కనెక్షన్ ను అధికారులు తమ శాఖలో పనిచేసే కాంట్రాక్టర్ ద్వారా పనులు చేయించాల్సి ఉంటుంది. విద్యుత్ కనెక్షన్ మంజూరైన రైతుకు ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు, వైర్లు ఇతర సామాగ్రి వాటిని కాంట్రాక్టర్‌కు అప్పగించి రైతు పొలంలో లొకేషన్ చెప్పి పనులు చేయమని ఆదేశిస్తారు. అయితే పలువురు రైతుల పేరిట మంజూరైన సామాగ్రిని తీసుకెళ్లిన కాంట్రాక్టర్ సంబంధిత రైతు పొలంలో పనులు చేయకుండా వాటిని పక్కదారి పట్టించి సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలు వినపడుతున్నాయి. డిడి చెల్లించిన రైతులు కనెక్షన్‌కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఇంకా మంజూరు కాలేదని చెబుతూ కాలం వెల్లదీయడం పరిపాటిగా మారింది. గట్టిగా అడిగిన రైతులను దబాయిస్తూ ముందు డిడి కట్టిన రైతులు చాలా మంది ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేయడం ఇక్కడి అధికారులకు పరిపాటిగా మారింది. దీంతో రైతులు తమకి ఇంకా మంజూరు కాలేదన్న భ్రమలో మిన్నకుండిపోతున్నారు. అయితే వారి పేరును మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు, వైర్లు, ఇతర సామాగ్రి స్టోర్ రూమ్ నుండి డ్రా చేసుకున్నట్లు రికార్డులో ఉంటున్నాయి. ఈ విషయంపై సంబందిత రైతుల ఫోన్‌కు మెసేజ్ రావడంతో రైతులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. మండలంలోని పుల్లంపల్లికి చెందిన నాగరాజు అనే రైతుకు అధికారులు విద్యుత్ స్తంభాలు మాత్రమే ఇచ్చి ఆయన పొలంలో స్తంభాలను నాటారు. ఇంకా ఆయనకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కనెక్షన్ ఇవ్వలేదు. అయితే ఆ రైతుకు ప్రస్తుతం కరెంట్ బిల్లు వచ్చింది. బిల్లు రావడంతో ఆ రైతు ఒక్కసారి ఆశ్చర్యపోయాడు. మరుసటి రోజే విద్యుత్ కార్యాలయానికి వచ్చి అడిగితే రెండు మూడు రోజుల్లో కనెక్షన్ ఇచ్చేస్తామని బుజ్జగింపులు చేయడం మొదలుపెట్టారు. ఆదే విధంగా రచ్చుమరి గ్రామానికి చెందిన నాగరాజు అనే రైతుకు రెండేళ్ల క్రితం కరెంట్ కనెక్షన్ మంజూరు అయింది. ఈ రైతుకు ఇప్పటికీ కనెక్షన్ ఇవ్వలేదు. ఈ రైతుకు మంజూరైన సామాగ్రిని ఎక్కడ ఎవరికి ఇచ్చారో అధికారులకే తెలియాలి. ఇలా ఒకటి కాదు రెండు కాదు మండల వ్యాప్తంగా కో కొల్లాలుగా ఉన్నాయి. కణేకల్ విద్యుత్ శాఖలో అవినీతి అక్రమాలకు హద్దు లేకుండా పోయిందని బాధిత రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్ స్థాయి అధికారి అండదండలతో ఇక్కడ పనిచేస్తున్న కాంట్రాక్టర్లు, మండల స్థాయి అధికారులు బరితెగించి అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. రైతులకు మంజూరైన సామాగ్రిని పక్కదారి పట్టించి లక్షలాది రూపాయలు దండుకుంటున్నారన్న బహిరంగ విమర్శలు వినపడుతున్నాయి. ఇప్పటికైనా సంబందిత శాఖ ఉన్నత అధికారులు స్పందించి అవినీతి అక్రమాలపై విచారణ చేసి రైతులకు న్యాయం చేయాలని, అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న అధికారులకి కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

వివరణ : కణేకల్ విద్యుత్‌శాఖలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ట్రాన్స్‌కో ఎస్ఇ సురేంద్రబాబును ప్రజాశక్తి వివరణ కోరగా కనెక్షన్లు ఇవ్వకుండా బిల్లులు వచ్చిన వాటిపై విచారణ చేస్తామన్నారు. రైతులకు తెలియకుండా అక్రమంగా ఇతరులకు వారి సామాగ్రిని ఇచ్చిన అధికారులపైనా, కాంట్రాక్టర్‌పైనా చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేస్తామన్నారు.

మూడు అడుగుల కోసం...

పొలం గట్టు విషయంలో ఘర్షణ

వ్యక్తి మృతి.. మరొకరి పరిస్థితి విషమం

మృతిచెందిన నాగార్జున

గాయపడిన కంబగిరి

ప్రజాశక్తి-పుట్లూరు

పొలం గట్టు వద్ద మూడు అడుగుల భూమి కోసం నెలకొన్న సమస్య చివరకు ఓ నిండు ప్రాణాన్ని ఆరడుగుల గోతిలోకి నెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. పొలం గేటు హద్దు ఏర్పాటులో నెలకొన్న ఘర్షణలో నాగార్జున (36) మృతిచెందగా, అతని చిన్నాన్న కంబగిరి తీవ్ర గాయాలపాలయ్యాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో కంబగిరిని మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. వివరాల్లోకి వెలితే యల్లనూరు మండలంలోని 85-నిట్టూరు గ్రామ వ్యవసాయ పొలంలోని సర్వే నెంబర్ 5, 6లో గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డికి పక్కనే ఉన్న రైతు మేడుకుర్తి గ్రామానికి చెందిన ఆదినారాయణ కుటుంబీకుల మధ్య సరిహద్దు విషయంలో తగాదా నెలకొంది. రెండు నెలల క్రితం ప్రభుత్వం నిర్వహించిన భూ సర్వేలో మృతుడు నాగార్జున కుటుంబీకులకు వెంకటరెడ్డి వ్యవసాయ పొలంలో మూడు అడుగుల వరకూ వచ్చింది. అయితే ఈ మూడు అడుగుల భూమిని వదులుకునేందుకు వెంకటరెడ్డి ససేమిరా అనడంతోపాటు, చుట్టూ కంచే ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో నాగార్జున కుటుంబీకులు సదరు రైతుకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో మంగళవారం ఉదయం స్థానిక పోలీసులను ఆశ్రయించారు. అయితే పోలీసులు ఇది సివిల్ సమస్య తహశీల్దార్ వద్దకు వెళ్లి పరిష్కరించుకోవాలంటూ సూచించడంతో బాధిత రైతులు తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లగా తహశీల్దార్ అందుబాటులో లేకపోవడంతో విఆర్ఓకు సమస్యను వివరించారు. వెంటనే స్పందించిన విఆర్ఒ శ్రీనివాసులు ఘటనా స్థలానికి వెళ్లి సమస్యను పరిశీలించి వెనుదిరిగాడు. అధికారుల వద్దకు వెళ్లినా, పోలీసుల వద్దకు వెళ్లినా తమకు న్యాయం జరగదని అనుకున్న బాధిత రైతులు కంచెను వేయకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో వెంకటరెడ్డి, అతని కుమారుడు పెద్దిరెడ్డి ఆవేశానికి లోనై చేతిలో ఉన్న మరణాయుధాలతో నాగార్జున తలపై బాదడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. అడ్డుకునే ప్రయత్నం చేసిన కంబగిరి ముఖంపై కొడవలి దెబ్బ తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బంధువులు బాధితులను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే నాగార్జున మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కంబగిరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ సుబ్రమణ్యం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని ఘటనపై ఆరాతీసి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న రాప్తాడు డీఎస్పీ శివారెడ్డి ఘటనా ప్రాంతానికి చేరుకుని వివరాలను ఆరాతీశారు. నిట్టూరు గ్రామంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైసిపికి కొమ్ముకాస్తున్న అధికారులు

సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

రిలేదీక్షల్లో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

ప్రజాశక్తి-గార్లదిన్నె

ప్రభుత్వ అధికారులకు ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులతో జీతాలు తీసుకుంటూ వైసిపి నాయకులకు కొమ్ముకాస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ అన్నారు. మండలంలో పేదలపై జరుగుతున్న దాడులు, అధికార పార్టీ నాయకులు చేస్తున్న భూకబ్జాలు, అధికారుల అక్రమాలపై మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. అంతకుముందు సిపిఎం ఆధ్వర్యంలో బస్టాండ్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ అధికారులు తమ విధులను పేదల కోసం చేయాలని సూచించారు. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదన్నారు. ఇలా అధికార పార్టీ నాయకులకు కొమ్ము కాసిన చాలామంది అధికారులు కాలగర్భంలో కలిసిపోయారన్నారు. దీనికి ఉదాహరణ సత్యసాయి జిల్లాలో ఈ మధ్యనే జరిగిన సబ్ రిజిస్ట్రార్ ఆత్మహత్య అని గుర్తు చేశారు. వేమన శతకంలో చెప్పినట్టు ఇంత పెద్ద సర్పమైన చలి చీమల చేతిలో ఎలా చనిపోతుందో ఇంత పెద్ద నాయకులైనా ప్రజల చేతుల్లో ఓడిపోక తప్పదన్నారు. మండలంలో అధికార పార్టీ నాయకులు ఎన్ని అక్రమాలు చేసినా అధికారులకు కనిపించడం లేదన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ, పోలీసులు, ప్రజాప్రతినిధులే అక్రమాలకు పాల్పడుతుంటే ఎవరు కాపాడుతారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై ఆధారాలతో సహా నివేదికలు అందజేసినా ఎవరూ పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడన్నారు. పేదలు సెంటు అరసెంటు ఇంటి కోసం స్థలం ఆక్రమించుకుంటే అధికారులు ఆగమేఘాలపై వచ్చి తొలగిస్తారన్నారు. కోటంక గ్రామంలో సర్వేనెంబర్ 243-1లో ఎస్సీ, ఎస్టీ నిరుపేదలు సాగు చేసుకుంటే అధికారులే అక్రమంగా చింతచెట్లను నాటారన్నారు. అడ్డుకోబోయిన మహిళలపై దాడి చేయడం బాధాకరమన్నారు. అలాగే మండల కేంద్రంలోని 456 సర్వే నెంబర్‌లో ఆరెకరాల ప్రభుత్వ భూమిని అధికార పార్టీ నాయకులు దొంగ పత్రాలు సృష్టించి ప్లాట్లు వేసి అమ్ముతున్నారన్నారు. ఈ విషయాలన్నీ అధికారులకు తెలియజేసినా ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. వెంటనే ఆయా ఘటనలపై ఉన్నతాధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో వచ్చేవారంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, మండల కార్యదర్శి చెన్నారెడ్డి, నాయకులు నాగమ్మ, రాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముఖ హాజరు తప్పనిసరి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో పని చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది తప్పనిసరిగా నిర్దేశించిన పని వేళల్లో ముఖ హాజరును తప్పనిసరి అని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఇ.బి.దేవి సూచించారు. మంగళవారం నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం సమావేశ భవనంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య ఆరోగ్య సిబ్బంది వారికి సూచించిన వేళల్లో ముఖ హాజరు వేయకుండా వేతనాల్లో కోత విధిస్తారని హెచ్చరించారు. కాగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కంటి వైద్యానికి సంబంధించి గుర్తించిన రోగులకు కాటరాక్ట్ ఆపరేషన్ల చికిత్స చేయించాలన్నారు. అలాగే గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై వారి పరిధిలోని ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, కార్యాలయ పరిపాలన అధికారి గిరిజా మనోహర్, స్టాటిస్టిక్స్ అధికారి మారుతీప్రసాద్, డెమో ఉమాపతి, డిప్యూటీ డెమో త్యాగరాజు, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే కుమ్మర శాలివాహనుల అభివృద్ధి

అనంతపురం కలెక్టరేట్ : కుమ్మర శాలివాహనులకు రాజకీయ చైతన్యం తెలుగుదేశం పార్టీతో సాధ్యమవుతుందని కుమ్మర శాలివాహన సాధికార రాష్ట్ర కన్వీనర్ మదనపు పోతలయ్య అన్నారు. మంగళవారం సింగనమల నియోజకవర్గం మర్తాడు గ్రామంలో బీసీ భరోసా బాటలో భాగంగా బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమ్మరి శాలివాహనులు రాజకీయంగా సామాజికంగా వెనకబడి ఉన్నామని, మనందరం భావితరాల భవిష్యత్తు కోసం రాజకీయంగా చైతన్యవంతులు కావాలన్నారు. టిడిపితోనే అధి సాధ్యమవుతుందని, రాబోవు రోజుల్లో కుమ్మరులందరూ టిడిపికి అండగా నిలుద్దామన్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మర శాలివాహన సాదికర సంస్థ అనంతపురం పార్లమెంట్ కన్వీనర్ కే.ప్రదీప్ కుమార్, రాష్ట్ర కమిటీ మెంబర్ కె.ఓబుల్ పతి, నాయకులు కే.రామకష్ణ, గదలింగప్ప, నాగరాజు, వేణుగోపాల్, నాగార్జున తదితరులు హాజయ్యారు.

విద్యార్థిని చితక బాదిన హెచ్ఎంపై విచారణ

అనంతపురం సిటీ : నగరంలోని పొట్టి శ్రీరాములు పాటశాల ప్రధానోపాధ్యులు ఇటీవల ఓ విద్యార్థిని చితక బాదిన ఘటనపై డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు మంగళవారం విచారణ చేపట్టారు. ముందుగా విద్యార్థులు మరియు సిబ్బందితో జరిగిన ఘటన పై విచారించారు. విచారణ లో వచ్చిన అభిప్రాయాలు ఉన్నతాధి కారులకు నివేదికలు ఇస్తామన్నని అనంతపురం డిప్యూటీ డిఈఓ శ్రీనివాసరావు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

2024 గెలుపే లక్ష్యం: మంత్రి

కళ్యాణదుర్గం : 2024 సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో వైసీపీ నియోజకవర్గ సోషల్ మీడియా సభ్యులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ సిఎం జగన్ ప్రజల కోసం తీసుకొచ్చిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అదే సమయంలో ఎల్లో మీడియా, టిడిపి చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. రాష్ట్రానికి జగన్ ఎంత అవసరమో ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈకార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, నియోజకవర్గంలోని వైసీపీ మీడియా సభ్యులు పాల్గొన్నారు.

'నాడు-నేడు'పై అంగన్వాడీలకు శిక్షణ

నార్పల : మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఐసిడిఎస్ సిడిపిఓ భారతి ఆధ్వర్యంలో నాడునేడు కార్యక్రమంపై అంగన్వాడీలు, సూపర్‌వైజర్లకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా నార్పల ప్రాజెక్టులో అంగన్వాడీ సెంటర్లకు నాడు-నాడు-2 కింద సెంటర్ల రిపేరులు, మంచినీరు, ఎలక్ట్రిసిటీ, పెయింటింగ్, మరుగుదొడ్లు వంటి వాటిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, నోడల్ అఫీసర్ వనజాక్షి, ఎంఇఓ కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సమస్యలు పరిష్కరించాలి : ఆల్‌మేవా

మైనార్టీ సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్‌ను ఆల్‌మేవా సభ్యులు

ప్రజాశక్తి-అనంతపురంకలెక్టరేట్

ముస్లిం మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అల్ మైనార్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆల్ మేవా) ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చిన మైనార్టీ సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్‌ను స్థానిక ఆల్‌మేవా ప్రతినిధులు కలిసి పలు సమస్యలను విన్నవించారు. ముఖ్యంగా వివిధ రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న మైనార్టీ ఉద్యోగులకు ప్రమోషన్లలో తీవ్ర అన్యాయం జరుగుతోందని, ఉద్యోగ నియామకాల్లో కూడా తగిన న్యాయం జరగలేదంటూ వాపోయారు. అలాగే ఉర్దూ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, మైనార్టీ సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న ఉర్దూ అకాడమీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కర్నూలు జిల్లాలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నెలకొల్పిన అబ్దుల్ హఖ్ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుల కొరత ఉందని, ప్రస్తుతం పని చేస్తున్న వారికి జీతాల చెల్లింపులో కూడా చాలా జాప్యం అవుతోందన్నారు. వీటితోపాటు అనేక సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో అల్ మైనారిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు షేక్షావలి, ఉపాధ్యక్షులు జిలాన్, కోశాధికారి దౌలా, అదనపు కార్యదర్శి అన్వర్, ఇమ్రాన్ తదితరులు ఉన్నారు.

టిడిపి లక్ష్యంగా ఓట్ల తొలగింపు : మాజీ ఎమ్మెల్యే వైకుంఠం

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

తెలుగుదేశం పార్టీనే లక్ష్యంగా చేసుకుని ఓట్ల తొలగింపు ప్రక్రియ సాగుతోందని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి ఆరోపించారు. మంగళవారం టిడిపి అర్బన్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం విశ్వాసం కోల్పోయిందని, తిరిగి అధికారంలోకి రావడానికి కుట్రలు కుతంత్రాలకు తెర లేపారని విమర్శించారు. ప్రతిపక్షాలపై కేసులు పెట్టడం, ఆనగదొక్కడం లాంటి చర్యలకు పాల్పడుతూ టిడిపి అనుచరుల, కార్యకర్తలను ఓట్ల తొలగింపు చేపట్టారని తెలిపారు. యుదేచ్ఛగా దొంగ ఓట్లు చేర్పిస్తున్నారని, పార్టీ శ్రేణులు ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించినప్పుడు వాస్తవాలు బయటకు వస్తున్నాయని తెలిపారు. ఓట్లు జంబ్లింగ్ చేస్తూ ఇంటిలో సభ్యులవి ఒక బూతులో కుటుంబ పెద్దవి మరో బూతులో చేరుస్తున్నారని ఆరోపించారు. నగరంలో ఫామ్ 8 ద్వారా ఎమ్మెల్యే అనంత ప్రోద్భలంతో ప్రతి బూతులోనూ 20 నుంచి 30 ఓట్ల తొలగింపుకు శ్రీకారం చుట్టారని ఆధారాలు చూపారు. ప్రజాస్వామ్యంలో ఇది మంచి పద్ధతి కాదని ఏకపక్షంగా ఓట్ల తొలగింపు జరుగుతోందన్నారు. ఎలక్షన్ కమిషన్‌ను, ఎస్పీని కలిసి ఫామ్ 8 ద్వారా ఓట్ల తొలగింపుపై ఫిర్యాదు చేస్తామన్నారు. యదేచ్ఛగా దొంగ ఓట్లు చేర్చే ప్రక్రియ కూడా ప్రారంభమైందన్నారు. ప్రజలంతా ఎప్పటికప్పుడు తమ ఓటు చెక్ చేసుకోవాలన్నారు. ఓటు ద్వారానే ప్రజాస్వామ్యంలో గుర్తింపు లభిస్తుందని, మంచి వ్యక్తులను ఎన్నుకోవడానికి ఓటే వజ్రాయుధం అన్నారు.

గేట్స్ కళాశాలకు ఎన్‌బిఐ హోదా

ప్రజాశక్తి-గుత్తి

నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ ఢిల్లీ ఆధ్వర్యంలో గేట్స్ ఇంజనీరింగ్ ఆఫ్ టెక్నాలజీ చెందిన కళాశాలలోని ఎలక్ట్రానిక్స్ కమ్యునికేషన్, ఎలక్ట్రికల్ జీవీ ఇంజనీరింగ్ బ్రాంచిలకు ఎన్‌బిఎ హోదాను కల్పిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 3, 4, 5వ తేదీల్లో ఎన్‌బిఎ ఢిల్లీ బృందం నిర్వహించిన తనిఖీల ఫలితాలను విడుదల చేసింది. ఈ సందర్భంగా కళాశాలల్లోని ఉన్నత ప్రమాణాలు, విద్యబోధన, కళాశాలల్లో విద్యార్థులు చేరే సంఖ్య, ప్లేస్‌మెంట్ లాంటి తదితర అంశాలను పరిగణంలో తీసుకుని ఎన్‌బిఎ గుర్తింపును ప్రకటించారు. దీంతో అన్ని ప్రమాణాలు కలిగి ఉన్న గుత్తిలోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు ఎన్‌బిఎ హోదాను కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ ఇదే సంవత్సరంలో కళాశాలకు న్యాక్ ఏ గుర్తింపు, అటానమస్ హోదా వచ్చిందన్నారు. ప్రస్తుతం ఎన్‌బిఎ రావడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు.

గుత్తి గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల

ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలి

డిఎంహెచ్‌ఒ ఇబి.దేవి

ప్రజాశక్తి-అనంతపురం

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఇ.బి.దేవి సూచించారు. మంగళవారం నగరంలోని డిఎంఅండ్‌హెచ్‌ఒ కార్యాలయంలో వచ్చేనెల 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించాలన్నారు. అలాగే ర్యాలీలు నిర్వహించి ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ సుజాత, జిల్లా మలేరియా అధికారి గిరిధర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి విష్ణుప్రియ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ డిపిఎం వెంకటరత్నం, సూపర్‌వైజర్ జివి.రమణ, సిబ్బంది మురళి, నారాయణస్వామి, డిప్యూటీ హెచ్‌ఈఓ గంగాధర్, అనంత నెట్‌వర్క్ వీరాంజనేయులు, రామాంజనేయులు, నెహ్రూ యువ కేంద్రం ప్రతినిధులు భరత్, జీవన్‌కుమార్, ఎన్‌జిఒ ప్రతినిధులు సుధాకర్, కిరణ్మయి, శేషాద్రి, రమేష్, మహేష్, రమేష్, నరేష్, శ్రీనివాసరెడ్డి, జగన్నాథరెడ్డి, అశోక్, చైల్డ్‌ఫండ్ ఇండియా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎంఅండ్‌హెచ్‌ఒ దేవి

ఆటోనగర్‌లో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనంతపురం

రాప్తాడు రహదారి పక్కన ఉన్న ఆటోనగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని టిఎన్‌టియుసి అనంతపురం, సత్యసాయి జిల్లాల అధ్యక్షులు పోతుల లక్ష్మీనరసింహులు, తాడాల నాగభూషణం డిమాండ్ చేశారు. మంగళవారం ఆటోనగర్ కాలనీలో టిఎన్‌టియుసి నాయకులు పర్యటించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో రహదారులు సరిగా లేక, వీధిదీపాలు వెలగక, దొంగతనాలు జరుగుతున్నాయన్నారు. నీటి సౌకర్యం చాలా అధ్వానం తయారైందన్నారు. వెంటనే అధికారులు, నాయకులు స్పందించి ఆటోనగర్‌లో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుర్రం నాగభూషణం, ప్రధాన కార్యదర్శి కుంచపు వడ్డే వెంకటేష్, టిడిపి బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దలవాయి వెంకటనారాయణ, నగర అధ్యక్షులు పూల బాషా, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న నాయకులు

కరువును కప్పి పెడుతున్న ప్రభుత్వాలు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాలో నెలకొన్న కరువును కప్పిపెడుతూ పేదల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీష్ విమర్శించారు. మంగళవారం మండల పరిధిలోని ములకలపెంట గ్రామంలో పర్యటించి వలస కూలీల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒక్క ములకలపెంట గ్రామంలో నే దాదాపు వంద కుటుంబాలకుపైగా 150 మంది కార్మికులు వివిధ నగరాలకు వలస వెళ్లినట్లు గుర్తించారు. గ్రామంలో వర్షాభావ కారణంగా పంటలు పండక చేసుకోవడానికి పనులు లేక అప్పుల భారంతో వలసలు వెళ్లారన్నారు. అన్నం పెట్టే రైతన్న పరిస్థితి ఇంత దీనంగా ఉంటే సిఎం జగన్ రైతులను ఓదార్చడం కానీ, రైతుల దయానియా పరిస్థితికి ఊరట కల్పించే చర్యలు గానీ చేపట్టకపోవడం బధాకరమన్నారు. ప్రభుత్వం కేవలం ఎన్నికల్లో గెలుపు కోసమే పని చేస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధి హామీ పథకం ద్వారా ఏడాదిలో 200 రోజులు పని దినాలు కల్పించి రోజుకు రూ.600 కూలి పడేలా చూడాలన్నారు. అలాగే రైతులందరికీ రూ.2లక్షల వరకూ రుణమాఫీ చేయడంతోపాటు ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు గోవిందు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సిపిఐ మండల కార్యదర్శి రాయల్ రాము, పట్టణ కార్యదర్శి గోపినాథ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దేవేంద్ర, ములకలపెంట గ్రామశాఖ కార్యదర్శి గోవిందు, నాయకులు ఉమర్ బాషా, కుళ్లాయప్ప, మల్లయ్య, నూర్ మహమ్మద్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా గుంతకల్లు కౌన్సిల్ సమావేశం

అజెండా అంశాలు మినహా..ప్రజా సమస్యలు గాలికి..

ప్రజాశక్తి-గుంతకల్లు

మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్.భవాని అధ్యక్షతన మంగళవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో నిర్వహించిన సాధారణ సమావేశం మొక్కుబడిగా సాగిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సమావేశంలో సమస్యలపై చర్చించి పరిష్కారం చూపుతారని ఆశించిన ప్రజలకు నిరాశ మిగిలింది. ముందుగా 50 అంశాలతోనూ దానికి అనుబంధంగా 5 అంశాలతో మరో అజెండా ప్రవేశపెట్టారు. తొలి అజెండాలో కేవలం 4 అంశాలు మినహా 46 అంశాలు, మరో అజెండాలోని 5 అంశాలు సభ్యులు ఆమోదం తెలిపారు. ప్రజా సమస్యలపై చర్చ గాలికి వదిలేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకపోతే పట్టణంలో కుక్కల దాడుల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని 10వ వార్డు వైసిపి కౌన్సిలర్ విజయలక్ష్మి, టిడిపి కౌన్సిలర్లు పవన్‌కుమార్, కృపాకర్ కోరారు. అలాగే ప్రజాధనం దుర్వినియోగం కాకుండా అభివృద్ధి పనులు నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. అంతటితో సమావేశం ముగిస్తున్నట్లు ఛైర్‌పర్సన్ భవాని ప్రకటించడం గమనార్హం. ఈ సమావేశంలో మున్సిపల్ ఇంజనీరు గురప్పయాదవ్, ఇన్‌ఛార్జి అసిస్టెంట్ సిటీ ప్లానర్ అబ్దుల్‌సత్తార్, మెప్మా టిపిఆర్వో మోహన్, ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మల్లికార్జున

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

పేదల సొంతింటి కల నేరవేర్చాలన్న లక్ష్యంతో సిఎం జగన్ మంజూరు చేసిన స్థలంతోపాటు ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇన్‌ఛార్జి ఎంపిడిఒ చంద్రమౌళి అధ్యక్షతన మంగళవారం స్థానిక వీరశైవ కళ్యాణ మండపంలో పట్టణంలోని జగనన్న లేఅవుట్లలో ఇంటి నిర్మాణాలు ప్రారంభించని, మధ్యలో ఆపిన లబ్ధిదారులు, హౌసింగ్ అధికారులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా 3,500 ఇళ్లను ప్రభుత్వం మంజురు చేసిందన్నారు. ఇందులో 1,747 ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో, 1740 మంది సొంత స్థలాల్లో ఇంటి నిర్మాణాలు చేపట్టారన్నారు. వీటిలో ఇప్పటి వరకూ 394 మంది ఇంటి నిర్మాణాలు ప్రారంభించలేదన్నారు. 454 మంది కేవలం బేస్ మట్టం వరకూ కట్టి ఆపేశారన్నారు. జిల్లాలోనే అత్యధికంగా ఇళ్లు మంజూరు చేయించామన్నారు. ఇంటి నిర్మాణానికి సంఘాల ద్వారా మహిళలకు రూ.35వేలు సున్నా వడ్డీతో రుణాలు, ఉపాధి హామీ కింద జాబ్ కార్డు కల్గిన మహిళలకు రూ.25వేలు అదనంగా అందిస్తున్నట్లు తెలిపారు. కావున డిసెంబర్ 15వతేదీలోగా ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారిణి కుష్బూకొఠారి, ఎంపిపి నరసింహులు, జడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, వైఎస్ ఎంపిపి శ్రీనాథ్‌రెడ్డి, కమ్మ, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు తేజోనాథ్, గోవిందు, వెంకటేష్, వైసిపి పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు బసవరాజు, మాజీ ఎంపిపి చంద్రమ్మ, డిప్యూటీ తహశీల్దార్ హరిప్రసాద్, హౌసింగ్ డిఇ హనుమప్ప, ఎఇ అశ్వర్థనారాయణ, సమన్వయకర్త ఓబన్న, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

'వై ఏపీ నీడ్స్ జగన్'లో నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. మంగళవారం సాయంత్రం 35వ డివిజన్‌లోని 51వ సచివాలయం పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు సంబంధించి బోర్డులతోపాటు వైసిపి వైసీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉంటేనే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. గతంలో 600 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో నాలుగున్నరేళ్లుగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌ను సిఎంను చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొండ్రెడ్డి రాధ, మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతిసాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, అనంత చంద్రారెడ్డి, వీరా, రామకృష్ణారెడ్డి, మధుసుదన్‌గౌడ్, సైఫుల్లా బేగ్, ఇషాక్, భాస్కర్, అనిల్, జ్యోతి, మాజీ కౌన్సిలర్ చంద్రశేఖరరెడ్డి, నాగరాజురెడ్డి, లోకనాథ్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, సద్దాం, దిలీప్, హరీష్ రెడ్డి, దాదా, నరసింహులు, రాజేష్, బాలరాజు, మహబూబ్ బాషా, ఆదిరెడ్డి, నాగరాజు రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, పెద్దన్న, గోపాల్‌రెడ్డి, మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : టిడిపి తప్పుడు వాగ్దానాలను నమ్మి మోసపోవద్దనివిప్ కాపు రామచంద్రారెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య సూచించారు. మంగళవారం పట్టణంలోని 12వ సచివాలయం వద్ద 'ఏపీకి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమంలో నిర్వహించారు. ఇందులోఉ భాగంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డుతోపాటు వైసిపి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు డిష్ గోవింద, పైతోట సంజీవ, మాధవరెడ్డి, సిద్ధప్ప, శివప్ప, శ్రీనివాస్‌యాదవ్, ఫక్రుద్దీన్, శ్రీలక్ష్మి, పద్మజ, వన్నూరప్ప, షబ్బీర్, మంజునాథ, శ్రీనివాసరెడ్డి, నజీర్, శ్రీనివాసులు, శ్రీనివాసులు, శ్రీనివాసులు, బషీర్, రవి, రిబ్కా, ముస్తాక్, మల్లి, ఒబా, నాగరాజు, ఆనంద్, వంశీ, వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బెలుగుప్ప : అర్హులందరికీ రూపాయి లంచం తీసుకోకుండా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని జడ్పిటిసి భర్త త్రిలోక్‌నాథ్‌రెడ్డి, కన్వీనర్ మచ్చన్న, ఎంపిపి పెద్దన్న తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని రామసాగరం గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కి జగనన్నే మళ్లీ ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దు ద్దేకుంట రామాంజనేయులు, శివలింగప్ప, గోపాల్, సర్పంచులు రామలక్ష్మి, నక్కలపల్లి రామిరెడ్డి, మారుతీరెడ్డి, ఎంపిటిసి వీరబ్రహ్మన్న, గోవింద్‌రెడ్డి, కేశవరెడ్డి, తలకప్ప చెన్నకేశవరెడ్డి, చితంబర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, సంజీవరెడ్డి, జీకే కేశవరెడ్డి, సన్న రెడ్డి, ధన, తిమ్మారెడ్డి, ఎల్లారెడ్డి, రుద్రస్వామి, ఎర్రిస్వామి, యుఆర్‌డి మాధవరెడ్డి, వాలంటరీలు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రారంభానికి సిద్ధమైన పశు వైద్య కేంద్రం

బెలుగుప్ప : మండల కేంద్రంలో నిర్మించిన పశువైద్య కేంద్రం ప్రారంభానికి సిద్ధమైంది. ఈమేరకు పశు సంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ జి.వెంకటేష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపి తలారి రంగయ్య నిధులు రూ.30లక్షలతో సింగిల్‌విండో ప్రెసిడెంట్ శివలింగప్ప సంపూర్ణ సహకారంతో పశువైద్య కేంద్రం నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. కేంద్రం అందుబాటులోకి వస్తే రైతులకు ఉపయోకరంగా ఉంటుందన్నారు.

టిడిపితోనే అభివృద్ధి : ఉన్నం వరలక్ష్మి

కుందుర్పి : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని ఉన్నం వరలక్ష్మి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వడ్డేపాళ్యంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. అనంతరం మహిళలకు చీర, గాజులు, పసుపు, కుంకుమ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నం వాణి, టిడిపి నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక విప్లవమూర్తి మహాత్మ జ్యోతిరావు పూలే

వర్థంతి కార్యక్రమాల్లో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలోని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ మహాత్మ పూలే గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. ముఖ్యంగా మహిళా అభ్యున్నతి, సాధికారతకు ఎనలేకి కృషి చేశారన్నారు. వితంతు వివాహాలను ప్రోత్సహించిన మహానుభావుడు అన్నారు. స్త్రీ జనోద్ధరణలో భాగంగా మొదట తన భార్య సావిత్రిబాయికి విద్య నేర్పించి ఆమె ద్వారా దేశంలో మొదటి మహిళా పాఠశాలను ప్రారంభించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, ప్రధాన కార్యదర్శి లింగమయ్య, గౌరవాధ్యక్షులు రమణయ్య, ఆడిట్ కన్వీనర్ సుబ్బరాయుడు, సీనియర్ నాయకులు మహమ్మద్, జిలాన్, నాయకులు వీరేశ్వరచారి, మల్లికార్జున, పవన్, శ్రీనివాసులు, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అలాగే జిల్లాకేంద్రంలోని గ్రంథాలయంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు ఎల్‌ఎం.ఉమామోహన్‌రెడ్డి, కార్యదర్శి పి.రమ, సంస్థ మాజీ అధ్యక్షులు ఎల్‌ఎం.మోహన్‌రెడ్డి, ఉప గ్రంథాలయ అధికారిణి వి.సుబ్బరత్నమ్మ, సిబ్బంది కావేరి, బాషా, విజయ, ఉజ్జినేశ్వరి, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

అలాగే పిడిఎస్‌యు ఆధ్వర్యంలో కురుగుంట అంబేద్కర్ గురుకుల పాఠశాలలో రాజ్యాంగం హక్కులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వీరేంద్ర ప్రసాద్ అధ్యక్షత వహించగా ముఖ్య వక్తలుగా రిటైర్డ్ ఆర్‌ఐఒ కిష్టప్ప, ఓపిడిఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ కుమార్, కేవీపిఎస్ జిల్లా అధ్యక్షులు శ్రీరాములు, ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి హాజరయ్యారు.

అలాగే టిడిపి ఆధ్వర్యంలో మహాత్మా జోయతిరావుపూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.పూలే చిత్రపటానికి నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కుమ్మరి శాలివాహన సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మదనపు పోతలయ్య, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల కిష్టయ్య, కార్యదర్శి లక్ష్మీ నరసింహులు, రాష్ట్ర కార్యదర్శులు ఆదినారాయణ, నాగరాజు, దేవళ్లమురళి, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : పేదరిక నిర్మూలన కోసం నిరంతరం పోరాటం చేసిన సామాజిక విప్లవమూర్తి మహాత్మ జ్యోతిరావు పూలే అని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు కొని యాడారు. మంగళవారం స్థానిక హంపిరెడ్డి భవనంలో భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డివైఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో డివైఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి దాసరి చరణ్ కుమార్ అధ్యక్షతన పూలే వర్ధంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్‌ఐ పట్టణ అధ్యక్షులు మద్దికెర ప్రతాప్, జిల్లా కమిటీ సభ్యుడు సురేంద్రబాబు, చొక్కా సునీల్‌కుమార్, సాకే నాగరాజు, వైటిసి.రమేష్ పాల్గొన్నారు.

అనంతపురం : మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడి, వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య మాట్లాడుతూ పూలే ఆశయాలకు అనుగుణంగా సిఎం జగన్ పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే బీసీ, ఎస్సీ ఎస్టీ, మైనార్టీ వర్గాలకు నామినేటెడ్ పదవులు, వివిధ పనుల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. అదేవిధంగా క్యాబినెట్ కూర్పులో సైతం మెజారిటీ భాగం బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ వర్గాలకే కేటాయించారని గుర్తు చేశారు. ముఖ్యంగా రాష్ట్రంలో 56 బీసీ కార్పొరేషన్లను ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీమ్ అహ్మద్, రజక కార్పొరేషన్ ఛైర్మన్ మీసాల రంగన్న, నాయకులు ఎర్రిస్వామిరెడ్డి, కొగటం విజయ భాస్కర్‌రెడ్డి, దాసరి వాసంతి సాహిత్య, లిఖిత, బోయ వీరాంజనేయులు, మాల్యవంతం మంజుల, మహాలక్ష్మి శ్రీనివాస్, రిజ్వాన్, గౌస్‌బేగ్, ఆలమురు శ్రీనివాసరెడ్డి, రాజారాం, రిలాక్స్ నాగరాజు, సైఫుల్లా బేగ్, శ్రీదేవి, కొర్రపాడు హుస్సేన్‌పీరా, మదన్‌మోహన్‌రెడ్డి, పెన్నోబులేసు, మధుసూదన్, అనిల్‌కుమార్‌గౌడ్, కృష్ణవేణి, రాధా, భారతి, తదితరులు పాల్గొన్నారు.

అలాగే జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టి.సి.వరుణ్‌బి ఆదేశాల మేరకు నగరంలోని జెడ్పీ కార్యాలయం వద్ద ఉన్న విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అంకే ఈశ్వరయ్య, కిరణ్‌కుమార్, అవుకు విజయ్‌కుమార్, మేదర వెంకటేష్, హుస్సేన్, దరాజ్‌బాషా, అంజి, సంపత్, ఆకుల అశోక్, సంతోష్, అనసూయ, దాసరి సరిత, నజీమ్, కుమ్మెపల్లి ప్రవీణ్, హీద్దు, తిన్నమర్రి శీన, హరీష్ రుద్రంపేట, విజయ్ దేవరయల్, హరి, వంశీ, నౌషాద్, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : పూలే వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని విగ్రహానికి ఎస్సీ, ఎస్టీ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి ఆధ్వర్యంలో మంగళవారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దండువారిపల్లి కుళ్లాయప్పచ రాజు, పూసల మధు, చెన్నంపల్లి మహేష్, వెంకటాపురం నారాయణస్వామి, నాగరాజు, దుబ్బ వెంకటేష్, దసరా బుల్లోడు, రామకృష్ణ, నారాయణస్వామి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో నగరంలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి టి.రంగయ్య, వ్య.కా.సం నియోజకవర్గ అధ్యక్షుడు ఎ.నారాయణరెడ్డి, కార్యదర్శి వి.టి.రామాంజినేయులు, తాడిపత్రి మండల కార్యదర్శి ఎ.నాగరంగయ్య, పెద్దపప్పూరు మండల కార్యదర్శి చింతా పురుషోత్తం, నాయకులు ఓబుళేష్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో పూలేకు నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తాడిపత్రి రూరల్ : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన రూరల్ పరిధిలోని చుక్కలూరు రోడ్డు పారిశ్రామిక వాడ వద్ద చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండల పరిధిలోని చుక్కలూరు గ్రామానికి చెందిన విశ్వనాథ్ (25) పని నిమిత్తం తాడిపత్రికి వచ్చి తిరిగి వెళ్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. దీంతో విశ్వనాథ్ అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మద్యం ధ్వంసం

కళ్యాణదుర్గం : వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యాన్ని స్థానిక పోలీసులు, జిల్లా సెబ్ అధికారులతో కలిసి మంగళవారం ధ్వంసం చేసినట్లు రూరల్ సీఐ నాగరాజు తెలిపారు. కంబదూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో పలువురు అక్రమంగా మద్యం తరలిస్తుంటే నిఘా వేసి పట్టుకున్న 2779 మద్యం బాటిళ్లను పట్టణ శివార్లలో ధ్వంసం చేసినట్లు తెలిపారు.

ఆత్మహత్య చేసుకోబోయిన యువకుడిని రక్షించిన పోలీసులు

పెద్దపప్పూరు : రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోబోయిన యువకుడిని పోలీసులు కాపాడిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... యాడికి గ్రామానికి చెందిన చెందిన రంగస్వామి ఆత్మహత్య చేసుకోవాలని భావించి రైల్వేట్రాక్ మీద ఉండగా గమనించిన స్టేషన్‌మాస్టర్ పెద్దపప్పూరు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని యువకుడిని రక్షించారు. కుటుంబ సమస్యలతోనే ఆత్మహత్య చేసుకోవాలని వచ్చినట్లు రంగస్వామి తెలిపారు. తర్వాత కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కౌన్సిలింగ్ ఇవ్వడంతోపాటు రంగస్వామిని అప్పగించారు. దీంతో తమ కుటుంబ సభ్యుడిని రక్షించిన స్టేషన్‌మాస్టర్‌తోపాటు పోలీసు రహీంకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రక్షించిన యువకుడితో కానిస్టేబుల్ రహీం, స్టేషన్‌మాస్టర్

భార్యపై భర్త గొడ్డలితో దాడి

గుత్తి : కట్టుకున్న భార్యపై గొడ్డలితో దాడి చేసిన ఘటన మంగళవారం తెల్లవారు జామున గుత్తి ఆర్‌ఎస్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆర్‌ఎస్ లోని ఎస్సీ కాలనీ చెందిన రవి కుమార్, భార్యదేవి సోమవారం రాత్రి గొడవపడ్డారు. మంగళవారం ఇంటిలో తెల్లవారుజామున నిద్రిస్తున్న దేవి పై భర్త రవికుమార్ గొడ్డలితో విచక్షణ రహితంగా నరికాడు. తీవ్రంగా రాయపడ్డ ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం ఆమెను అనంతపురం సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్లారు. సంఘటనా స్థలాన్ని సిఐ ఎం. వెంకటరామిరెడ్డి పరిశీలించారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతున్న దేవి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గార్లదిన్నె : మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో గ్రామంలో జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కేశవాపురం గ్రామానికి చెందిన నాగేంద్ర (47) కల్లూరులో క్యాంటీన్ నడుపుతున్నాడు. ఇందులో భాగంగా క్యాంటీన్‌ను ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా అంబేద్కర్ విగ్రహం వద్ద వైజంక్షన్‌లో గోడను ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. మృత్తునికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నట్లు సమాచారం. ఘటనప వివరాలు తెలియాల్సి ఉంది.

ఘర్ ఘర్ కెసిసి అభియాన్‌పై అవగాహన

పుట్లూరు : మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో ఘర్ ఘర్ కెసిసి అభియాన్‌పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిసిసి బ్యాంకు ద్వారా రైతులకు కల్పిస్తున్న ఘర్ ఘర్ కెసిసి అభియాన్‌పై, రుణాల వడ్డీ రేట్లు, బ్యాంకులో ఏ రుణాలు ఇస్తున్నారో రైతులకు సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎడిసిసి బ్యాంకు చీఫ్ మేనేజర్ అనిల్‌కుమార్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ భవాని, ఎఎస్‌ఎస్‌బి మేనేజర్ రామ్మోహన్‌రెడ్డి, సొసైటీ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

గట్టు వెంకటరమణ సేవలు మరువలేనివి

ఉరవకొండ : పట్టణంలోని గాంధీ హరిజన హాస్టల్ వ్యవస్థాపకుడు గట్టు వెంకటరమణప్ప ఎస్సీల విద్యాభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. వెంకటరమణప్ప జయంతిని పురస్కరించుకుని మాజీ సిడిపిఒ రామాంజినమ్మ అధ్యక్షత మంగళవారం హాస్టల్ కమిటీ సభ్యులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్తూరు ఆనంద్‌రాజు, గోపాల్, కోనాపురం ఎర్రిరస్వామి, వన్నూరుస్వామి, మీనుగ పెద్దన్న, లక్ష్మీనరసమ్మ, కింగూరి ఎర్రస్వామి, మాదిగ ఎల్లన్న, ఓబయ్య, సోమశేఖర్, ఇజ్రాయిల్, లత్తవరం చంద్ర, టైలర్ సునీల్, ఆంజనేయులు, తొండ్లం సుభాష్, ఆంజనేయ్య, రంజిత్, వేణు ప్రసాద్, సుంకన్న, తిప్పయ్య, ఎర్రిస్వామి, రమేష్, తట్రకల్లు ఇజ్రాయిల్, గుర్రం రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ బోరుకు మరమ్మతులు

ఉరవకొండ : మండల పరిధిలోని వెలుగొండ సర్పంచి వీరాంజనేయులు, వైసిపి నాయకులు నాగన్న ఆధ్వర్యంలో తాగునీటి పైప్‌లైన్ బోరుకు సంబంధించిన మోటర్‌కు మంగళవారం మరమ్మతులు చేపట్టారు. ప్రజల అభ్యర్థన మేరకు మోటారుకు మరమ్మతులు చేపట్టినట్లు సర్పంచి తెలిపారు.

డేగల కృష్ణమూర్తికి సన్మానం

శింగనమల : రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎన్నికైన డేగల కృష్ణమూర్తిని అనంతపురంలోని నివాసంలో టిడిపి నాయకులు, అభిమానులు మంగళవారం గజమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నిట్టూరు శివాజీ, నరేంద్రకుమార్‌యాదవ్, కొయ్యగూర పెద్దన్న, వడ్డే రామకృష్ణ, లోలూరు నారాయణస్వామి, మొండిపోగుల ఎర్రిస్వామి, డేగల హరీష్, రాచపల్లి శ్రీనాథ్, హాజీపీరా, భగవాన్, తదితరులు పాల్గొన్నారు.

'అనంతలక్ష్మి'లో ఆరు రోజుల కార్యశాల

అనంతపురం : అనంతలక్ష్మీ ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం మూడవ సంవత్సరం బిటెక్ విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ నైపున్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రెవిట్ ఆర్కిటెక్చర్‌పై ఆరు రోజులపాటు కార్యశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రమేష్ శిక్షకులుగా వ్యవహరించి విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్‌లో రెవిట్ ఆర్కిటెక్చర్‌పై అవగాహన కలిపించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ అనంత రాముడు, ప్రిన్సిపల్ రామమూర్తి, సివిల్ ఇంజనీరింగ్ కో ఆర్డినేటర్ పవన్ కుమార్‌రెడ్డి, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అతిథులు